
కథలాపూర్ రామాలయంలో సీతారాముని కల్యాణానికి హాజరైన భక్తులు


అయోధ్యలో తాళిబొట్టు చూపుతున్న అర్చకులు


సారంగాపూర్: పట్టువస్త్రాలు తలంబ్రాలు తీసుకొస్తున్న అధికారులు, నాయకులు


ఆత్మకూర్‌లో సీతారాముల కల్యాణం

కనుల పండువగా సీతారాముల కల్యాణం

కోరుట్లరూరల్/కోరుట్ల టౌన్/రాయికల్/మెట్‌పల్లి/మెట్‌పల్లిరూరల్/సారంగాపూర్/పెగడపల్లి/ఇబ్రహీంపట్నం/మల్లాపూర్/కథలాపూర్/మల్యాల: శ్రీరామనవమి వేడుకలు ఆదివారం జిల్లా వ్యాప్తంగా ఘనంగా జరిగాయి. ఆలయాల్లో శ్రీ సీతారాముల కల్యాణోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించారు. నిర్వాహకులు స్వామి వారికి పట్టువస్త్రాలు సమర్పించగా, వేద మంత్రోచ్చారణల మధ్య వేద పండితులు రాములోరి కల్యాణం జరిపించారు. కల్యాణ వేడుకలకు భక్తులు భారీగా తరలివచ్చారు. ఆలయాల్లో రద్దీ నెలకొంది. భక్తులకు నిర్వాహకులు తీర్థప్రసాదాలు, అన్నదానం చేశారు. కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, అధికారులు, వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


ఇబ్రహీంపట్నంలో సీతారాముల కల్యాణం


పెగడపల్లి: నామాపూర్‌లో స్వామి వారి కల్యాణం


బీర్‌పూర్‌లో స్వామివారి కల్యాణానికి హాజరైన భక్తులు


మెట్‌పల్లిలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే సంజయ్, మాజీ ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు


కోరుట్ల సీతారామాలయంలో స్వామివారి కల్యాణం


హన్మాజిపేటలో ....


సారంగాపూర్: రేచపల్లి జగన్నాథస్వామి ఆలయంలో చిన్నారుల నృత్యాలు

క్లుప్తంగా

మెగా హెల్త్ క్యాంపు సద్వినియోగం చేసుకోవాలి

కోరుట్ల: పట్టణంలోని కింగ్స్ గార్డెన్స్‌లో సోమవారం నిర్వహించే మెగా హెల్త్ క్యాంపును పట్టణ, పరిసర గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్, కేఎంవోజీఎస్, జమాతే ఈ ఇస్లామీ హింద్ ఉమెన్స్ వింగ్ కోరుట్ల ఆధ్వర్యంలో నిర్వహించే మెడికల్ క్యాంపులో ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ టెస్ట్, బ్లడ్ షుగర్ టెస్ట్, హిమోగ్లోబిన్ టెస్ట్, బోన్ డెన్సిటీ టెస్ట్, ఈసీజీ పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తారని తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తారన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

శ్రీ సరస్వతీ విద్యాపీఠం ఆవిర్భావ దినోత్సవం

కోరుట్లటౌన్: పట్టణంలోని శ్రీ సరస్వతీ శిశు మందిరం పాఠశాలలో ఆదివారం విద్యాపీఠం ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. మొదట ప్రబంధకారిణి కార్యదర్శి వనపర్తి చంద్రమోహన్, రమ్య దంపతుల ఆధ్వర్యంలో శ్రీరామునికి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం విద్యాపీఠం ఆవిర్భావ వైభవం వివరించారు. ఈ కార్యక్రమంలో సమితి కార్యదర్శి చెట్‌పెల్లి శంకర్, ఉపాధ్యక్షుడు వడ్లకొండ రాజగంగాధర్, సభ్యులు ముదిగొండ రాజేశం, రాజగంగారాం, సందీప్, శివప్రసాద్, అమర్‌నాథ్, విశాల్, టీచర్లు పాల్గొన్నారు.

వెల్లివిరిసిన మత సామరస్యం


వాటర్ బాటిళ్లు పంపిణీ చేస్తున్న ముస్లింలు

జగిత్యాలటౌన్: శ్రీరామనవమి పండుగను పురస్కరించుకుని హనుమాన్ దీక్షాస్వాములకు ముస్లిం సోదరులు వాటర్ బాటిళ్లు పంపిణీ చేసి మత సామరస్యాన్ని చాటారు. జగిత్యాల మీదుగా కొండగట్టు వెళ్లే హనుమాన్ దీక్షా స్వాములకు జగిత్యాల పట్టణం నిజామాబాద్ రోడ్డులో నఫీసియా మసీద్ అధ్యక్షుడు అబ్దుల్ రజాక్ ఖురేషి ఆధ్వర్యంలో శని, ఆదివారాల్లో సుమారు 500 మంచినీళ్ల బాటిళ్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మసీద్ కమిటీ సభ్యులు, రహమత్‌పుర యూత్ సభ్యులు పాల్గొన్నారు.

అలరించిన వీడ్కోలు వేడుకలు

కోరుట్ల: పట్టణంలోని లిటిల్ జీనియస్ హైస్కూల్‌లో పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు వేడుకలు శనివారం రాత్రి ఘనంగా జరిగాయి. ఎంఈవో గంగుల నరేశం పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదువుకొని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ స్వీటీ అనూప్, కరస్పాండెంట్ బండి మహదేవ్, టీచర్లు పాల్గొన్నారు.

బీజేపీ ఆవిర్భావ వేడుకలు


జగిత్యాలలో జెండావిష్కరించిన భోగ శ్రావణి


కోరుట్లలో జెండావిష్కరిస్తున్న జిల్లా అధ్యక్షుడు


జైనాలో జెండావిష్కరిస్తున్న నాయకులు

జగిత్యాలటౌన్/కోరుట్ల/ధర్మపురి/మెట్‌పల్లి/మెట్‌పల్లిరూరల్/రాయికల్/పెగడపల్లి/కథలాపూర్/మల్లాపూర్: బీజేపీ ఆవిర్భావ వేడుకలను ఆదివారం జిల్లా వ్యాప్తంగా బీజేపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. జగిత్యాల పట్టణంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు భోగ శ్రావణి జెండావిష్కరించారు. పట్టణాలు, పలు మండల కేంద్రాలు, గ్రామాల్లో పట్టణ అధ్యక్షులు, మండల అధ్యక్షులు, గ్రామ అధ్యక్షులు, బూత్ అధ్యక్షులు జెండాలు ఆవిష్కరించారు. ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వంలో కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు అత్యంత ప్రజాదరణ కలిగిన పార్టీ బీజేపీ అన్నారు. కార్యక్రమాల్లో బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయాలు కొనసాగించాలి


అంబేడ్కర్‌కు నివాళి అర్పిస్తున్న నాయకులు

జగిత్యాలటౌన్: అంబేడ్కర్ ఆశయాలను కొనసాగించడమే నిజమైన నివాళి అని లయన్స్ క్లబ్ మాజీ చైర్మన్ సిరిసిల్ల శ్రీనివాస్ అన్నారు. ప్రబుద్ధ భారత్ ఇంటర్నేషనల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం తహసీల్ చౌరస్తాలోని అంబేడ్కర్ విగ్రహానికి శ్రీనివాస్, ఫౌండేషన్ ప్రతినిధులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అంబేడ్కర్ భారతదేశ మొదటి న్యాయశాఖ మంత్రిగా పనిచేసిన మహనీయుడని కొనియాడారు. కార్యక్రమంలో ఫౌండేషన్ జిల్లా కోఆర్డినేటర్ నల్ల శ్యాం, టీపీసీసీ కార్యదర్శి బండ శంకర్, మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు చిత్తారి ప్రభాకర్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వార్షికోత్సవ సంబరాలు


నాట్య ప్రదర్శన అనంతరం విద్యార్థులతో ఉపాధ్యాయులు

మేడిపల్లి: భీమారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. శనివారం అర్ధరాత్రి వరకు జరిగిన వేడుకల్లో విద్యార్థులు ఆటపాటలతో అలరించారు. నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డీఈవో రాము హాజరై మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలు కార్పొరేట్ విద్యా సంస్థలకు దీటుగా విద్యాబోధన అందిస్తున్నాయన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం జవ్వాజి అశోక్, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ లావణ్య, నాయకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు

పెగడపల్లి: మండలంలోని దోమలకుంట ప్రాథమికోన్నత పాఠశాల వార్షికోత్సవం శనివారం రాత్రి ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థినులు, విద్యార్థులచే నిర్వహించిన నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.కార్యక్రమంలో హెచ్‌ఎం గాలి నాగరాజు, ఉపాధ్యాయులు విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.



దోమలకుంట ప్రాథమికోన్నత పాఠశాలలో నృత్యం చేస్తున్న విద్యార్థులు

'లో లెవల్' తిప్పలు తప్పేనా?

- వర్షాకాలంలో నిలిచిపోతున్న రాకపోకలు
- ఇబ్బంది పడుతున్న ప్రజలు
- హైలెవెల్ కల్వర్టులు నిర్మిస్తేనే ప్రయోజనం


దూలూర్‌- బొమ్మెన గ్రామాల మధ్య లో లెవల్ కల్వర్టు

కథలాపూర్: భారీ వర్షాలు కురిస్తే కొన్ని గ్రామాల్లో లో లెవల్ కల్వర్టుల పైనుంచి వరద ఉధృతంగా పారి రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. ఏటా వర్షాకాలం పల్లె ప్రజలకు ఇవే కష్టాలు ఎదురవుతున్నా.. పరిష్కారం గురించి పాలకులు, అధికారులు పట్టించుకోవడంలేదని విమర్శిస్తున్నారు. ప్రధాన రోడ్లపై తక్కువ ఎత్తులో ఉన్న కల్వర్టుల స్థానంలో ఎక్కువ ఎత్తులో బ్రిడ్జీలు నిర్మించాలని కథలాపూర్ మండల ప్రజలు కోరుతున్నారు. ఈ వేసవి కాలంలోనే హై లెవెల్ కల్వర్టులు నిర్మాణం చేపడితేనే ప్రయోజనం చేకూరుతుందన్నారు.

అధిక సమస్య ఉన్న కల్వర్టులు ఇవే..

భారీ వర్షాలు కురిస్తే కోరుట్ల– వేములవాడ రూట్‌లో కథలాపూర్ మండలం సిరికొండ శివారులో ఆయిల్ ఒర్రె వద్ద, ఇప్పపెల్లి శివారులో ఎల్లమ్మ ఒర్రె వద్ద వర్షాకాలం వరద ఉధృతంగా పారి రాకపోకలు రోజుల తరబడి నిలిచిపోయిన సందర్భాలున్నాయి. మండలంలోని తాండ్ర్యాల గ్రామశివారులో రెండు వైపుల కల్వర్టుల వద్ద వాగు ఉధృతంగా పారుతోంది. కల్వర్టు పైనుంచి రాకపోకలు సాగించేందుకు ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. దూలూర్‌– బొమ్మెన గ్రామాల మధ్య దూలూర్ శివారులో వాగు వద్ద కల్వర్టుపై నుంచి ఉధృతంగా పారితే రెండు గ్రామాల మధ్య రాకపోకలు బంద్ అవుతున్నాయి. పెగ్గెర్ల శివారులో ఊర చెరువు మత్తడి దుంకి రోడ్డుపై పారడంతో రాకపోకలు నిలిచిపోతున్నాయి. ఇప్పపెల్లి– పోతారం గ్రామాల మధ్య, అంబారిపేట– తుర్తి గ్రామాల మధ్య కల్వర్టులను ఎత్తుగా పెంచితే వర్షాకాలంలో రాకపోకలకు ఇబ్బంది ఉండదని ప్రజలు అంటున్నారు. ఈ వేసవి కాలంలో కల్వర్టులు నిర్మిస్తే వచ్చే వర్షకాలంలో ఇబ్బందులుండవని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికైనా లో లెవల్ కల్వర్టులను హై లెవల్ కల్వర్టులుగా మార్చేందుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసేలా ప్రజాప్రతినిధులు చొరవ చూపాలని మండల ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

రాకపోకలు బంద్



బొమ్మెన– దూలూర్ గ్రామాల మధ్య వాగు వద్ద లో లెవెల్ కల్వర్టు నిర్మించారు. భారీ వర్షాలు కురిస్తే వంతెన పై నుంచి నీళ్లు ఉధృతంగా పారుతాయి. రాకపోకలు నిలిచిపోతున్నాయి. ఆ సమయంలో మండలకేంద్రానికి చేరుకోవాలంటే అష్టకష్టాలు పడుతున్నాం. హై లెవెల్ కల్వర్టు నిర్మిస్తే బాగుంటుంది. ప్రజల సౌకర్యం గురించి ఆలోచించి ప్రజాప్రతినిధులు ఆ దిశగా చర్యలు తీసుకోవాలి.

– పిడుగు ఆనంద్‌రెడ్డి, బొమ్మెన

వరదలతో ప్రమాదాలు



వర్షాకాలంలో లో లెవెల్ కల్వర్టుల వద్ద వరద ఉధృతి వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయి. అత్యవసర సమయాల్లో గ్రామాలు దాటలేని పరిస్థితులు నెలకొంటున్నాయి. గంభీర్‌పూర్ గ్రామస్తులు కోరుట్లకు వెళ్లాలంటే సుమారు నాలుగు కల్వర్టుల వద్ద వరద ఉధృతిని తప్పించుకోవాల్సిన పరిస్థితి. ప్రమాదకరంగా ఉన్న లో లెవల్ కల్వర్టులను పరిశీలించి కొత్తగా నిర్మించాలి. ప్రజాప్రతినిధులు, అధికారులు చొరవ చూపాలి.

– నస్కూరి భాస్కర్, గంభీర్‌పూర్

ప్రతిపాదనలు పంపించాం

మండలంలో ప్రధాన రోడ్లపై ఉన్న లో లెవెల్ కల్వర్టులతో వర్షాకాలం రాకపోకలకు ఇబ్బంది ఉందని ప్రజల ద్వారా తెలుసుకున్నాం. సమస్యలున్న లో లెవెల్ కల్వర్టులను శాఖ పరంగా పరిశీలించాం. వాటిని హై లెవెల్ వంతెనలుగా మార్చడానికి ప్రతిపాదనలు తయారు చేసి ఉన్నతాధికారులకు పంపించాం. మంజూరు కాగానే పనులు చేయిస్తాం.

– లక్ష్మీకాంత్, రోడ్ల భవనాలశాఖ ఏఈ, కథలాపూర్ సెక్షన్

అలయన్స్ క్లబ్ జిల్లా గవర్నర్‌గా గజానందం


గజానందం

మేడిపల్లి: అసోసియేషన్ ఆఫ్ అలయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ జగిత్యాల జిల్లా గవర్నర్‌గా మండలంలోని దమ్మన్నపేట గ్రామానికి చెందిన బండ్ల గజానందం ఎన్నికైనట్లు ఇంటర్నేషనల్ వైస్ ప్రెసిడెంట్ అల్లె బాల గంగాధర శాస్త్రి తెలిపారు. ఈ సందర్భంగా గజానందంకు పలువురు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు కటుకం రాజేంద్రప్రసాద్, కటుకం సురేందర్, కైలాస నాగేశ్వర్ రావు, రాజశేఖర్, తొగరి లక్ష్మిపతి, కొక్కుల శంకర్ తదితరులు పాల్గొన్నారు.

అగ్నిమాపక కేంద్రంలో వైకుంఠ రథం


వైకుంఠరథం ఉంచిన నిర్వాహకులు

రాయికల్: పట్టణంలోని పోలీస్‌స్టేషన్ శివారులో దివంగత మాజీ మంత్రి జువ్వాడి రత్నాకర్‌రావు హయాంలో అగ్నిమాపక యంత్రాన్ని ఉంచేందుకు ఫైర్‌స్టేషన్ నిర్మించగా ఫైర్‌స్టేషన్‌ను తరలించడంతో ఫైర్‌స్టేషన్‌లో వైకుంఠ రథాన్ని ఉంచాల్సిన పరిస్థితి నెలకొంది. వేసవికాలం దృష్ట్యా రాయికల్ ఫైర్‌స్టేషన్‌ను పునరుద్ధరించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

శ్రీరామనవమి వేడుకల్లో స్వచ్ఛంధ సేవలు


ఉచితంగా టిఫిన్ పంపిణీ చేస్తున్న లక్ష్మణ్

జగిత్యాలటౌన్: శ్రీరామనవమి సందర్భంగా పలువురు స్వచ్ఛంధ సేవలందించారు. సత్య సాయి సేవా సమితి ప్రతినిధులు ఆలయాల్లో నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో భాగస్వాములయ్యారు.

శ్రీరామనవమిని పురస్కరించుకుని రామభక్తుడు లక్ష్మణ్ తన ప్రభు భక్తిని చాటుకున్నాడు. పట్టణంలోని ధరూర్ క్యాంపు కోదండ రామాలయ సమీపంలోని తన హోటల్‌లో కష్టమర్లకు అటుకులు చాయ్ ఫ్రీగా అందించాడు.

శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకుని తాజా మాజీ ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి పలు ఆలయాలను సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు.